క్లుప్తంగా

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రెంజల్(బోధన్): కేంద్ర ప్రభుత్వం గ్రామీణ నిరుపేదల కోసం అమలు చేస్తున్న ఉచిత సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంకర్ సూచించారు. మండలంలోని తాడ్‌బిలోలి, మౌలాలితండాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామ సభలను నిర్వహించారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలవుతున్న పథకాలను వివరించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు వెల్మల సునీత నర్సయ్య, జాదవ్ సునీతా బాబునాయక్, వివధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు అండగా పీఎం మోదీ



బోధన్‌టౌన్(బోధన్): బీసీలకు ప్రధాని నరేంద్రమోదీ అండగా ఉన్నారని, పీఎం విశ్వకర్మ యోజన పథకం కుల వృత్తులు చేసుకునే వారికి ఉపయోగకరంగా ఉంటుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్కర్ లక్ష్మినారాయణ, బీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ తెలపారు. పట్టణంలోని విశ్వకర్మ భవనంలో శనివారం వారు సమావేశం నిర్వహించి, మాట్లాడారు. బీసీకులాల్లో కులవృత్తులపై ఆధాపడి జీవనం సాగించే వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే పీఎం విశ్వకర్మ పథకం ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని బీసీ కులవృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు మారోజు సుధాకర్‌చారీ, కోడూరు నాగరాజు, గంగోనె వినోద్, హన్మాండ్లు చారీ, చిలుక ప్రవీణ్, సాయినాథ్, విజయ్, కందికట్ల శ్రీనివాస్, గుంత గంగాధర్ పాల్గొన్నారు.

రుణ మాఫీ వెంటనే చేయాలి



బాల్కొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు రెండు లక్షల రుణా మాఫీ వెంటనే చేపట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం జాతీయ రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందని నమ్మకంతో గెలిపించారన్నారు. కానీ ఇప్పటికీ ఆరు హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చకుంటే పోరాడుతామన్నారు. నాయకులు అంబటీ నవీన్, నర్సయ్య, కడ్తాల్ రవి, రాకేశ్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల బిల్లులు ఇవ్వాలి

పోతంగల్ (రుద్రూర్): డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు వెంటనే ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. పోతంగల్‌లో శనివారం సర్పంచ్ శంకర్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేసి, గ్రామంలోని సమస్యలపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని ప్రజలు కోరారు. వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల ఊరేగింపు



ఎడపల్లి (బోధన్): అయోధ్య రాముడిని పూజించిన అక్షింతలు శనివారం జానకంపేట్ గ్రామంలోని రామాలయానికి చేరుకున్నాయి. ఈసందర్భంగా గ్రామస్తులు అయోధ్య రాముడి అక్షింతలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.
మాక్లూర్: మండల కేంద్రంలో శనివారం రాత్రి శ్రీరాముడి అక్షింతల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నామస్మరణతో గ్రామంలో పండుగవాతావరణం నెలకొంది. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.







ఆర్మూర్‌లోని జెండా బాలాజీ మందిరంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు.. మామిడిపల్లి అపురూప వేంకటేశ్వర ఆలయంలో.. వేంపల్లిలోని వేంకటేశ్వర ఆలయంలో..



చౌట్‌పల్లిలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

ఆర్మూర్/మాక్లూర్/బాల్కొండ/కమ్మర్‌పల్లి/రుద్రూర్/బోధన్‌రూరల్/నవీపేట: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని వైష్ణవాలయాల్లో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆయా ఆలయాల్లో స్వామివార్లను భక్తులు ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకున్నారు. అలాగే పలు మండలాలు, గ్రామాల్లోని, వేంకటేశ్వర, రాములవారి, లక్ష్మినారాయణ, లక్ష్మినరసింహ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆర్మూర్‌లోని జెండా బాలాజీ మందిరం, లక్ష్మినర్సింహస్వామి మందిరం, రామాలయాల్లో భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పూజారులు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అడవిమామిడిపల్లి శివారులోని అపురూప వేంకటేశ్వర ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌట్‌పల్లిలో శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బోధన్‌లోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వర ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వర ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహించి ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ప్రసన్న వేంకటేశ్వర భజనమండలి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.



ఆర్మూర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి మందిరంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



పోతంగల్‌లోని బాలాజీ మందిరంలో అభిషేకం చేస్తున్న భక్తులు




బోధన్‌లోని లక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు.. నవీపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



అక్బర్‌నగర్‌లోని వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రోడ్డు పనుల్లో జాప్యం.. ఇబ్బందుల్లో జనం

- అసంపూర్తిగా నిలిచిన నాగాపూర్ రహదారి విస్తరణ పనులు
- వెంటనే పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్



కంకర వేసి వదిలేసిన నాగాపూర్ రోడ్డు

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ నుంచి నాగాపూర్ ఎక్స్ రోడ్డు వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం రోడ్డు వెడల్పు కోసం రూ. 2.42 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఆగస్టులో పనులకు శంకు స్థాపన సైతం చేశారు. వారం తరువాత పనులు ప్రారంభించారు. దీంతో ఈ రోడ్డు గుండ ప్రయాణించే ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ పనులు ప్రారంభమైన కొన్ని రోజులకే నిలిచిపోయాయి. నెల రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఈ రోడ్డు గుండా వెళ్లే ఇత్వారేపేట్, జలాల్‌పూర్, నాగాపూర్ ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

పట్టించుకోని అధికారులు..

గతంలో ఈ రోడ్డు ఇరుకుగా ఉండటం, ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరగడంతో రోడ్డు కనిపించకుండ పోయింది. దీంతో తరుచు ప్రమాదాలు జరిగాయి. ఈక్రమంలో రోడ్డు విస్తరణ కోసం పంచాయతీ రాజ్ విభాగంలో ఉన్న రోడ్డును ఆర్అండ్‌బీ విభాగంలోకి మార్చి నిధులు మంజూరు చేశారు. రోడ్డు పనుల్లో భాగంగా కంకర, డస్టు వేసి అసంపూర్తిగా నిలిపివేయడంతో ప్రయాణీకులకు తిప్పలు తప్పడం లేదు. వాహనాలు వెళితే చాలు దుమ్ముధూళి వెదజల్లుతోంది. అలాగే రోడ్డుపై కంకర ఉండటంతో ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

> **వచ్చే నెల ప్రారంభిస్తాం..**
>
> రోడ్డు పనులను వచ్చే నెలలో ప్రారంభిస్తాం. పనులు నిలిపివేయడంపై కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. పనులను వెంటనే ప్రారంభించాలని సూచించాం. వచ్చే నెలలో పనులు ప్రారంభించి వెంటనే పూర్తి చేస్తాం. పనులను వేగంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.
>
> – వినీత్, ఆర్అండ్‌బీ ఏఈఈ, బాల్కొండ

యేసు చూపిన మార్గంలో నడవాలి




ఆర్మూర్‌లో నిత్యావసర సరుకులను అందజేస్తున్న జెడ్పీచైర్మన్ విఠల్‌రావు.. జాన్కంపేట్‌లో ముస్తాబైన చర్చి

ఆర్మూర్: యేసు ప్రభువు చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ దీనజనులకు అండగా ఉండాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. పట్టణంలోని పలు చర్చిల్లో శనివారం ఆయన పేదలకు క్రిస్మస్ సందర్భంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని, మాట్లాడారు. క్రైస్తవులు పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ఆర్డీవో వినోద్ కుమార్, అధికారులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని స్మైల్స్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ షబానా గౌహర్, డైరెక్టర్ రఫీ గోహర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. విద్యార్థినులు ఏంజెల్స్ వేషధారణలో, బాలురు శాంటా క్లాస్ వేషధారణలో క్రిస్మస్ రైమ్స్ పాడుతూ సంబురాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు విమల, సింధుజ, శ్రావణి, రాజో, సవిత, స్వప్న, సంతోషిని, సరిత పాల్గొన్నారు.

ముస్తాబైన చర్చీలు

వేల్పూర్: క్రిస్మస్ వేడుకల కోసం మండలంలోని పలు గ్రామాల్లో చర్చీలు ముస్తాబు అయ్యాయి. అలాగే చర్చి ఆవరణల్లో జీసస్ జననాన్ని వివరించే నక్షత్రం, పశువుల పాకలను ఏర్పాటు చేశారు. వారం రోజుల నుంచి సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు.



ఆర్మూర్‌లోని స్మైల్స్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

సంక్షిప్తం

విద్యార్థుల క్షేత్రపర్యటన



ఆర్మూర్: పట్టణంలోని క్షత్రియ స్కూల్ విద్యార్థులను శనివారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వ్యవసాయ క్షేత్రాల పరిశీలనకు పాఠశాల యాజమాన్యం తీసుకెళ్లారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని వ్యవసాయ క్షేత్రాలను విద్యార్థులు సందర్శించి పసుపు, వరి, మొక్కజొన్న, ఎర్రజొన్న, కూరగాయలు పండించే విధానాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మినారాయణ, ప్రిన్సిపల్ అనిల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



వర్ని(మోస్రా): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన మొండి అశోక్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు శనివారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. తన ను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడికి అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు శ్యాంరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లన్న స్వామి ఉత్సవాలు

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో ఆదివారం నుంచి మల్లన్న స్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 11 రోజుల పాటు సాగే ఉత్సవాల్లో భాగంగా స్వామివారి పల్లకీ సేవా, ఎల్లమ్మ పూజ, గణపతి హోమం, చండీయాగం, బోనాల ఊరేగింపు, నాగవెల్లి, అగ్ని గుండాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని కుర్మ యాదవ సంఘం అధ్యక్షుడు పెద్ద ముత్తెన్న, కార్యదర్శి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

108 వాహనంలో ప్రసవం



బాల్కొండ: మండలకేంద్రానికి చెందిన గర్భిణి ఫాతిమాను ప్రసవం కోసం 108 వాహనంలో ఆర్మూర్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువవడంతో అంబులెన్సులోనే ప్రసవం జరిగింది. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం 108 ఈఎంటీ సదానంద్, సిబ్బంది వారికి ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కమ్మర్‌పల్లి/వేల్పూర్/బాల్కొండ: బాల్కొండ నియోజకవర్గంలోని పలు మండలాల్లో పలువురు కాంగ్రెస్ నాయకులు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు ముత్యం రెడ్డి, పాలెం చిన్నారెడ్డి, నాగంపేట్ గంగాధర్, మల్లారెడ్డి, గంగాశేషాద్రి, ఆకుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



నిజామాబాద్‌అర్బన్: ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వచ్చే నెల 12 నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘ ప్రతినిధులు కోరారు. ఈమేరకు శనివారం వారు నగరంలో కోటగల్లి జూనియర్ కళాశాలలో కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. నాయకులు మహేష్, విశాల్, గంగోత్రి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌అర్బన్: నూతన జాతీయ విద్యావిధానం రద్దు కోసం ఫిబ్రవరి 3న పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంను విజవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో శనివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు గౌతమ్ కుమార్, రాజేశ్వర్, కార్తిక్, ప్రిన్స్, దేవిక, రవీందర్, రామకృష్ణ, సాయినాథ్, నిఖిల్, మనోజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పీఆర్టీయూ ముందుకు సాగుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని మోపాల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం పీఆర్టీయూ మండల సమావేశం నిర్వహించారు. నూతన ప్రభు త్వం దృష్టికి టీచర్ల సమస్యలను పీఆర్టీయూ తీసుకెళ్లిందన్నారు. వెంకటేశ్వర్ గౌడ్, రవీందర్ నాయక్, రవీంద్రకుమార్, సాయిలు, శ్రీరాం నాయక్ పాల్గొన్నారు.

సెలవుల్లో మున్సిపల్ కమిషనర్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరందు ఈనెల 27వరకు వ్యక్తిగత సెలవుల్లో వెళ్లారు. దీంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా మున్సిపల్ కార్యదర్శి శ్రీపాద రమేశ్వర్ కొనసాగనున్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ 20 రోజులుగా విధులకు రావడంలేదు. వేరేచోట పోస్టింగ్‌కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

'ఆర్యసమాజ్'కు అండగా ఉంటా

సుభాష్‌నగర్: ఆర్యసమాజ్‌కు అండగా ఉంటానని, ప్రతి సంవత్సరం శ్రద్ధానంద బలిదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు శ్రద్ధానంద్ గంజ్‌లో శనివారం ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో శ్రద్ధానంద్ బలిదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధన్‌పాల్ పాల్గొని, మాట్లాడారు. స్వామి శ్రద్ధానంద స్వాతంత్ర్య సమరయోధుడని, ఆర్యసమాజ సన్యాసి అని తెలిపారు. ఆర్యసమాజ్ అధ్యక్షుడు కరిపె సూర్యప్రకాశ్, కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు లాభిషెట్టి శ్రీనివాస్, నాయకులు నాగోళ్ల లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి సహకరించండి

జిల్లా కేంద్రంలోని తమ సంఘం అభివృద్ధి కోసం నిధులు కేటాయించి సహకరించాలని ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణను రైతేరాజు మున్నూరుకాపు సంఘ సభ్యులు కోరారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వారు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే వారి సమస్యలకు సానుకూలంగా స్పందించారు. నాయకులు మల్లేష్, సాయిలు, చందు, రాజు, రమణ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఆక్వామెన్-2(ఇంగ్లీష్-2డీ)- 10.00, 7.15
హాయ్‌నాన్న(తెలుగు)- 12.45, 4.00
యానిమల్ (హిందీ)- 10.00

స్క్రీన్-2 – సలార్ (తెలుగు)- 08.30, 11.35, 3.10, 6.45, 10.20

స్క్రీన్-3 – సలార్ (తెలుగు) - 8.30, 12.05, 3.40, 7.15, 10.50

స్క్రీన్-4 – సలార్ (తెలుగు) - 8.45
డంకీ (హిందీ) - 12.20, 3.40, 7.00, 10.20